ట్రాఫిక్ చక్రబంధంలో 'పేట'

- రోజురోజుకూ పెరిగిపోతున్న వాహనాలు
- రహదారిపైకి వస్తున్న ఆక్రమణలు
- రోడ్లను మూసివేస్తున్న ఆక్రమణలను తొలగించాలంటున్న ప్రజలు

జగ్గయ్యపేట అర్బన్: ట్రాఫిక్ చక్రబంధంలో జగ్గయ్యపేట చిక్కుకుంది. రోజురోజుకూ వాహనాల రద్దీ పెరిగిపోవడంతో ట్రాఫిక్ చిక్కు ఎదురవుతోంది. పేట పురపాలక సంఘంలో 60 వేల జనాభా ఉంది. పట్టణ పరిసరాల్లో చిన్న, పెద్ద ఫ్యాక్టరీలు 25కి పైగా ఉన్నాయి. వీటికి కేంద్రంగా ఉన్న జగ్గయ్యపేటలో వాహనాలు పెద్ద సంఖ్యలో తిరుగుతున్నాయి. ఇక్కడ రోడ్లపై తరచూ ట్రాఫిక్ నిలుస్తోంది. ముఖ్యంగా రైతుబజారు సెంటర్, మున్సిపల్ కూడలి, బస్టాండ్ సెంటర్, ముక్త్యాలరోడ్, బలుసుపాడు సెంటర్లలో నిత్యం రద్దీ కారణంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.

తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం

ప్రధాన రోడ్లపై అనేకచోట్ల చిరువ్యాపారులు తోపుడు బండ్లు నిలుపుతుండటంతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ముఖ్యంగా రైతుబజారు వీధిలోని మినీ బైపాస్‌లో రోడ్డుపై అడ్డుగా ఉన్న అనేక చిరువ్యాపారుల కారణంగా నిత్యం ఇక్కడ ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులు, ఉద్యోగులు రాకపోకలు సాగించే సమయంలో రద్దీ మరింత పెరుగుతోంది. ప్రధాన రహదారులపై యథేచ్ఛగా పశువులు తిరుగుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నాయి.


పేటలో మున్సిపల్ కూడలి వద్ద నిలిచిన ట్రాఫిక్

కార్యకర్తల కోసం రోడ్డు మధ్యలో ఆకుకూరల షెడ్లు ఏర్పాటు

పార్టీ కార్యకర్తలకు లబ్ధి చేకూర్చేందుకు అధికార పార్టీ వారు రైతుబజారు వద్ద అసలే ఇరుకుగా ఉన్న 40 అడుగుల రోడ్డును సగం చేసి అక్కడ ఆకు కూరల షెడ్లను ఏర్పాటుచేశారు. దీంతో పట్టణంలో అత్యంత రద్దీ ప్రాంతమైన రైతుబజారు నుంచి మినీ బైపాస్‌కు వెళ్లే రోడ్డు సగం మూసుకుపోయి ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది.

ముందుకొచ్చిన ఆక్రమణలు.. తొలగించలేక అధికారుల పాట్లు

రైతుబజారుకు ఎదురుగా ఉన్న రైజింగ్ సన్ బిల్డింగ్ యజమానుల సంఘం పేరుతో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లో షాపుల వారు వారి దుకాణాల వద్ద ముందు సామాన్లు పెట్టుకోవడానికి ఏకంగా 10, 11 అడుగుల మేర ముందుకు వచ్చి ప్రధాన రహదారిని ఆక్రమించారు. వారిని అక్కడ నుంచి తొలగించాలంటే ట్రాఫిక్ పోలీసులకు తలనొప్పిగా మారింది.


రైతుబజారు వద్ద రోడ్డును సగం మూసివేసి నిర్మించిన ఆకుకూరల కౌంటర్ల షెడ్లు


రైతుబజారు ఎదురుగా రోడ్డును ఆక్రమించిన షాపులు

ఎవరిని కదిపినా రాజకీయ నాయకులకు ఫోన్లు చేస్తున్నారు. దీంతో వారు నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. ఇలా అనేక చోట్ల ప్రధాన రహదారులు ఆక్రమణలకు గురవడంతో ఇరుకుగా మారి ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. ఇప్పటికైనా ట్రాఫిక్ నియంత్రణకు పురపాలకసంఘం, పోలీస్, ఆర్ అండ్‌బీ శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

డివైడర్లు నిర్మించాలి



పట్టణంలో ప్రస్తుతం విజయవాడ రోడ్, హైదరాబాద్ రోడ్లలో మాత్రమే డివైడర్లు ఉన్నాయి. ముక్త్యాల, బలుసుపాడు రోడ్లలో డివైడర్లు లేవు. ఉదయం సాయంత్రం రద్దీ సమయాల్లో ట్రాఫిక్ కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. రైతుబజారు నుంచి ముక్త్యాల రోడ్‌లో విలియంపేట వరకు డివైడర్లు నిర్మించాలి. అప్పుడే ట్రాఫిక్‌ను కొంతవరకు నియంత్రించవచ్చు.

–తూమాటి కృష్ణమాచారి,
బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, జగ్గయ్యపేట

ప్రజాప్రతినిధులే ఆక్రమణలను ప్రోత్సహిస్తే ఎలా..



రోడ్లను ఆక్రమిస్తున్న వారికి ప్రజాప్రతినిధులే అండగా ఉంటుంటే ట్రాఫిక్‌ను ఎవరు కంట్రోల్ చేయగలరు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతుబజారు వద్ద ఇరుకుగా ఉందన్న కారణంతో టాయిలెట్లను తొలగించి వేరే చోట ఏర్పాటుచేశారు. ఇప్పుడు కూటమి పాలనలో రైతుబజారు వద్ద రోడ్డును సగం మూసివేసి ఆకుకూరల కోసం షెడ్లు ఏర్పాటుచేయడం ఎంత వరకు సమంజసం.

–గొట్టిపాళ్ల సురేష్,
వైఎస్సార్ సీపీ పట్టణ యూత్ ప్రధాన కార్యదర్శి

ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకుంటాం



పెరుగుతున్న ట్రాఫిక్‌కు నియంత్రణకు ప్రత్యేక ప్రణాళికను రూపొందిస్తున్నాం. డివైడర్ల నిర్మాణం, రోడ్డు ఆక్రమణల తొలగింపునకు సంబంధిత అధికారులతో చర్చిస్తాం. రైతుబజారు వద్ద రోడ్డుపై ఆకుకూరల షెడ్ల నిర్మాణంపై కౌన్సిల్‌లో చర్చించడంతో పాటు ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటాం.

–ఎం.రామ్మోహనరావు,
మున్సిపల్ కమిషనర్

క్లుప్తంగా

నీటి తొట్టెలు శుభ్రం చేశారు



సాక్షి ఎఫెక్ట్

పెనుగంచిప్రోలు: పశువుల దాహార్తిని తీర్చే నీటి తొట్టెలను శుభ్రం చేశారు. 'నీటి తొట్టెల నిర్వహణ గాలికి' శీర్షికతో 'సాక్షి' మంగళవారం కథనం ప్రచురించింది. దీనిపై అధికారులు స్పందించారు. లింగగూడెం పంచాయతీ కార్యదర్శి శ్యామ్ దగ్గరుండి నీటి లింగగూడెం రోడ్డులోని తొట్టెను శుభ్రం చేయించారు. దానిలో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించి వినియోగంలోకి తీసుకువచ్చారు. పశువైద్యాధికారి అనిల్ మాట్లాడుతూ వేసవిలో పశువుల దాహార్తి తీర్చేందుకు మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా 14 నీటి తొట్టెలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడు 'ముక్కా'కు సత్కారం



పెనుగంచిప్రోలు: పెనుగంచిప్రోలుకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ముక్కా సత్యనారాయణకు హైదరాబాద్‌లో సోమవారం రాత్రి రవీంద్రభారతిలో సన్మానం జరిగింది. మహతి సాహితీ కవిసంగమం వారి ఐదవ వార్షికోత్సవం సందర్భంగా వివిధ ప్రక్రియల్లో తొమ్మిదివేలకు పైగా రచనలు చేసిన ముక్కా సత్యనారాయణను సన్మానించి మహతి కవి భూషణ బిరుదును అందించారు. కొనకలూరి ఇనాక్, జానపద కళల మాజీ చైర్మన్ పొట్లూరి హరికృష్ణ, సాదనాల వెంకటస్వామినాయుడు చేతుల మీదుగా బిరుదు అందుకున్నారు.

విద్యార్థికి అభినందన



నందిగామ టౌన్: 'పది' ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనపరచడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 591 మార్కులు సాధించిన కంచికచర్ల మండలం గొట్టుముక్కల గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత వరికూటి నాగేశ్వరరావు కుమారుడు మహేంద్రను స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన ప్రత్యేకంగా అభినందించారు. జగన్‌మోహనరావు మాట్లాడుతూ భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

వీరులపాడు: మెడికల్ షాపు నిర్వాహకులు విధిగా డ్రగ్ లైసెన్స్ కలిగి ఉండాలని ఎస్‌ఐ అనిల్ పేర్కొన్నారు. మండలంలోని మెడికల్ దుకాణాల యజమానులతో మంగళవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు వైద్యాధికారులు సూచించిన మందులనే విక్రయించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా మత్తు పదార్థాలు, ప్రభుత్వ నిషేధిత మందులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల మందుల దుకాణాల నిర్వాహకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు రామారావుకు అభినందనలు



జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు టి.రామారావుకు ఆ పార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు, పార్టీ నేతలు అభినందనలు తెలిపారు. ఇటీవల నియమితులైన ఎన్టీఆర్ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు రామారావు మంగళవారం మొట్టమొదటి సారిగా జగ్గయ్యపేటలోని నియోజకవర్గ పార్టీ కార్యాలయానికి వచ్చి పార్టీ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం పట్టణ ప్రధాన కార్యదర్శి గొట్టిపాళ్ల సురేష్, ముక్త్యాల నాగుల్‌మీరా పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానం పెంపొందాలి

మైలవరం: విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానం పెంపొందాలని సీఐఐ (కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ) ఆర్‌వీ టెక్నాలజీ సొల్యూషన్ ఎండీ వి.రమేష్ అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి కాలేజీ ఎంబీఏ విద్యార్థులకు సీఐఐ ద్వారా మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇంటర్వ్యూ అనేది ఒక వైపు సంభాషణ కాదని, రెండు వైపులా ఉంటుందన్నారు. విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూలో విజయం సాధించేందుకు సహాయ పడే వివిధ చిట్కాలను వివరించారు.

5న ఆలయాల భూముల కౌలు వేలం

నందిగామ రూరల్: మండలంలోని పెద్దవరం, రాఘవాపురం గ్రామాల్లోని ఆయా ఆలయాలకు చెందిన భూముల బహిరంగ కౌలు వేలం పాటలను నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఈవో గంగాధర్ మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ పెద్దవరం గ్రామంలోని చెన్నకేశవ స్వామి ఆలయానికి చెందిన 12.46 ఎకరాలు, నీలకంఠేశ్వర స్వామి ఆలయానికి చెందిన 12.60 ఎకరాలకు మే 5వ తేదీ ఉదయం 10 గంటలకు ఆయా ఆలయాల ప్రాంగణంలో బహిరంగ కౌలు వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రాఘవాపురం గ్రామంలోని రామలింగేశ్వర స్వామి, మల్లేశ్వర స్వామి వార్ల ఆలయాలకు చెందిన 12.76 ఎకరాలకు మే ఆరున ఉదయం 10 గంటలకు రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో బహిరంగ కౌలు వేలం పాటలు జరుగుతాయన్నారు. దేవదాయ శాఖ నిబంధనల మేరకు జరిగే వేలంలో ఆసక్తి కలిగిన రైతులు పాల్గొనాలని కోరారు.

గోవులకు గడ్డి అందజేత

పెనుగంచిప్రోలు: గ్రామంలోని శ్రీ గోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మ దేవస్థానంలోని గోవులకు మంగళవారం వరిగడ్డిని వితరణగా అందజేశారు. ముండ్లపాడు గ్రామానికి చెందిన రైతు ఆళ్ల రాజశేఖర్‌రెడ్డి 102 వరికట్టలు, పదివేల రూపాయలు విలువచేసే గడ్డిని గోశాలలోని గోవులకు అందించారు. రైతు రాజశేఖర్‌రెడ్డిని కార్యనిర్వహణాధికారి, చైర్మన్ అభినందించి అమ్మవారి ప్రసాదంతోపాటు జ్ఞాపికను అందజేశారు.

రైసుమిల్లు తనిఖీ

జగ్గయ్యపేట: పట్టణంలో చిల్లకల్లు రోడ్డులోని వెంకటేశ్వర పార్ బాయిల్డ్ రైస్‌మిల్లును పౌరసరఫరాల శాఖ డీటీ వెంకటేశ్వరరావు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల నుంచి రైతులు తీసుకువచ్చే ధాన్యాన్ని.. ఇబ్బంది పెట్టకుండా ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు. హెచ్ఎంటీ రకం ధాన్యాన్ని తీసుకువస్తే మిల్లర్లు కొనుగోలు చేయడం లేదని పలువురు రైతులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆయన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సీహెచ్‌వోల సమస్యలు పరిష్కరించండి

వత్సవాయి: కమ్యూనిటీ హెల్త్ అధికారుల(సీహెచ్‌వో) సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మంగళవారం వత్సవాయి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీ మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు సమ్మె చేస్తున్నామన్నారు. సీహెచ్‌వోలుగా ఆరేళ్లు పూర్తిచేసుకున్న వారిని రెగ్యులర్ చేయడం, జాతీయ హెల్త్ మిషన్ ఉద్యోగులతో సమానంగా వేతన పెంపుదల అమలుచేయడం, నిర్దిష్టమైన జాబ్‌చార్ట్, పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సమ్మెలో ఉన్నా ఎమర్జెన్సీలో సేవల్లో మాత్రం అందుబాటులో ఉంటామని తెలిపారు.


వత్సవాయి పీహెచ్‌సీ వద్ద ఆందోళనలో సీహెచ్‌వోలు

కార్యక్రమంలో కె.మధు, డి.సురేష్, ఇందిరాప్రియదర్శిని, సీహెచ్ సీతామహాలక్ష్మి, జి.స్వాతి తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిబిరాలను వినియోగించుకోండి


కంచికచర్ల గ్రంథాలయంలో డ్రాయింగ్ వేసిన విద్యార్థులు


వేసవి తరగతుల్లో విద్యార్థులు

కంచికచర్ల: వేసవి విజ్ఞాన శిబిరాలను వినియోగించుకోవాలని గ్రంథపాలకుడు అల్లూరి రామచంద్రుడు పేర్కొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. గ్రంథాలయంలో విద్యార్థులకు డ్రాయింగ్ నేర్పించారు. కార్యక్రమంలో కవి నీలం సర్వేశ్వరరావు, ఉపాధ్యాయుడు ఎం.కనకారావు, బీడీసీ నిర్వాహకుడు శ్రీనివాసరావు విద్యార్థులు పాల్గొన్నారు.

కొణకంచి(పెనుగంచిప్రోలు): వేసవి విజ్ఞాన తరగతులు రెండో రోజు మంగళవారం శాఖా గ్రంథాలయంలో జరిగాయి. విద్యార్థులకు పుస్తక పఠనంతో పాటు కథలు చెప్పారు. విద్యార్థులు నృత్యాలు చేశారు. పాటలు పాడారు. ఆటలు ఆడారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి రామచంద్రుడు, ఎర్ర భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట అర్బన్: ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఉన్న జిల్లా గ్రేడ్–1 శాఖ గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ తరగతులు మంగళవారం రెండో రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆసక్తి కలిగించే కథలను పిల్లలు చదువుకుని వాటిలోని సారాంశాన్ని, నీతిని ఎలా అర్థమైందో తెలిపే పుస్తక సమీక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వ ఉపాధ్యాయుడు ప్రసాద్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. జెడ్పీ బాలుర హైస్కూల్ ఇంగ్లిష్ టీచర్ వినోద్‌బాబు ఇంగ్లిష్ హ్యాండ్ రైటింగ్ క్యాపిటల్ లెటర్స్ నుంచి నేర్పించారు. గ్రంథాలయాధికారి ఎ.ప్రభ, గ్రంథాలయ సిబ్బంది జె. శ్యామల, ఎ.రమేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ సభను జయప్రదం చేయండి

జగ్గయ్యపేట అర్బన్: అమరావతి పునర్నిర్మాణ శంకుస్థాపన కోసం మే 2 వ తేదీన ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సభను విజయవంతం చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత పిలుపునిచ్చారు. మోదీ సభను జయప్రదం చేయాలని కోరుతూ జగ్గయ్యపేట పట్టణంలోని ఎస్‌వీఎస్ కల్యాణమండపంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య)ఆధ్వర్యంలో సమావేశంలో జరిగింది. టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం, మాదిగ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి పాల్గొన్నారు.

నందిగామ రూరల్: కూటమి పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో సాగుతుందని మంత్రి సవిత పేర్కొన్నారు. ప్రధాని పర్యటనకు సంబంధించి స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యతో కలిసి మంగళవారం ఆమె పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

బాల్య వివాహాలతో అనారోగ్య సమస్యలు

నందిగామ రూరల్: బాల్య వివాహాలతో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, వాసవ్య మహిళా మండలి సంయుక్త ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని పాస్టర్లు, పురోహితులు, మైనార్టీ ఖాజీలకు బాల్య వివాహాలపై మంగళవారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువతులకు 18 ఏళ్లు, యువకులకు 21 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం చేయాలన్నారు. ముఖ్యంగా బుధవారం అక్షయతృతీయ సందర్భంగా వివాహాలు జరిగే అవకాశం ఉండటంతో బాల్య వివాహాల నియంత్రణలో భాగంగా అవగాహన కలిగించినట్లు తెలిపారు. కిశోర బాలికలకు మే 2 నుంచి జూన్ 10 వరకు ప్రత్యేక క్యాలెండర్ ద్వారా బాల్య వివాహాలు, పోక్సో, రుతుక్రమం, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య, తదితర విషయాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బాలల పరిరక్షణ జిల్లా అధికారి రాజేశ్వరరావు, ఎంపీడీవోలు శ్రీనివాసరావు, నాంచారయ్య, ఏసీడీపీవో కృష్ణకుమారి, ఈవో బొగ్గవరపు రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.


బాల్య వివాహాలపై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న పీడీ

వసతుల కల్పనలో రాజీ లేదు

జగ్గయ్యపేట అర్బన్: కనీస వసతుల ఏర్పాటుకు అధికారులు, ఉద్యోగులు చిత్తశుద్ధితో పని చేయాలని ఈ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్ హాల్లో జరిగిన అత్యవసర సమావేశంలో పలువురు సభ్యులు తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి లైట్ల సమస్యలపై ఏకరువుపెట్టారు. చైర్మన్ మాట్లాడుతూ పట్టణంలో అన్ని వార్డుల్లో శానిటేషన్ విషయంలో కౌన్సిలర్లు ఎవరూ సంతోషంగా లేరన్నారు. తాగునీటి సరఫరా, వీధిలైట్లపై ప్రత్యేక దృష్టిసారించి ప్రణాళికతో ముందుకు పోవాలని అధికారులకు సూచించారు.


కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్ వి.మనోహర్

బిల్లుల మంజూరులో జాప్యం

మరో కౌన్సిలర్ రోశయ్య మాట్లాడుతూ ఏఈ లేకపోవడంతో కాంట్రాక్టర్లకు బిల్లుల మంజూరులో జాప్యం జరుగుతోందన్నారు. దీనిపై చైర్మన్ స్పందిస్తూ కాంట్రాక్టర్లంతా పేపర్‌పై తమ బిల్లుల్లో తీవ్ర జాప్యం జరగడానికి కారణం కమిషనర్‌నేనని రాసి ఇస్తే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీనిపై కౌన్సిలర్ మనోహర్ మాట్లాడుతూ కంట్రాక్టర్లు, అధికారులు, కౌన్సిలర్లతో రివ్యూ మీటింగ్ ఏర్పాటుచేయాలని సూచించారు. రెండు రోజుల్లో ఏర్పాటుచేయాలని చైర్మన్ అధికారులకు సూచించారు.

వేలంపాట నిర్వహించండి

వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ వట్టెం మనోహర్ మాట్లాడుతూ ఉక్కుకళావేదిక, ఆర్టీసీ కాలనీలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లను ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో నుంచి పురపాలకసంఘం స్వాధీనం చేసుకొని వాటి నిర్వాహణకు వేలం పాట నిర్వహించాలని కోరారు. దీనిపై చైర్మన్ మాట్లాడుతూ రేపే వాటికి తాళాలు వేసి స్వాధీనం చేసుకోవాలని, మరమ్మతులు అవసరమైతే చేయించాలని కమిషనర్‌ను ఆదేశించారు. త్వరలో పబ్లిక్ ఆక్షన్ పెట్టాలని సూచించారు. మనోహర్ అక్రమ లేఅవుట్లకు సంబంధించి ప్రశ్నించగా.. చైర్మన్ స్పందిస్తూ కౌన్సిల్ సభ్యులు, అధికారులతో కలిసి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గత నెల బడ్జెట్ మీటింగ్‌లో రూ. 9 కోట్ల అభివృద్ధి పనులను కౌన్సిల్‌లో చేర్చారని, ఇప్పటి వరకు టెండర్లు ఎందుకు పిలవలేదని మనోహర్ ప్రశ్నించారు.

మెరుగైన సేవలు అందించడంలో విఫలం

ముందుగా మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ మాట్లాడుతూ పట్టణంలో రెండు నెలలుగా పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా విషయంలో ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో విఫలమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై చైర్మన్ మాట్లాడుతూ వాటర్ సప్లైకి సంబంధించి రూ.11.23 కోట్లు మంజూరయ్యాయని, హెడ్ వాటర్‌వర్క్స్ నుంచి విలియంపేట డౌన్ వరకు పైపులైన్లు ఏర్పాటు చేస్తామన్నారు. 40 వీధిలైట్లు కూడా రెండు రోజుల్లో వస్తాయన్నారు.

పలు సమస్యల ప్రస్తావన

మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజున్నీసా తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలపై ప్రస్తావించారు. ఇతర సభ్యులు పలు సమస్యలను ప్రస్తావించారు. అనంతరం అజెండాలోని 20 అంశాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. కమిషనర్ ఎం.రామ్మోహనరావు, అందరు కౌన్సిలర్లు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

కనులపండువగా శ్రీవారి కల్యాణం


వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవంలో మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు


కల్యాణ క్రతువులో దంపతులు

నందిగామ రూరల్: శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు కనుల పండువగా సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారిని అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, అర్చనలు చేశారు. అనంతరం ఎదురుకోలోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక అలంకరించిన కల్యాణ మండపంలో పండితులు యోగానందాచార్యులు, అనంతాచార్యులు స్వామి వారి కల్యాణాన్ని జరిపించారు. పలువురు దంపతులు పీటలపై కూర్చున్నారు. ఆలయ కమిటీ సభ్యులు నకిరికంటి విశ్వేశ్వరరావు, గద్దె మధుసూదనరావు, బండారు కేదార్‌నాథ్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు కల్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు ఆయనకు స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు స్వామి వారి శేష వస్త్రం, ఆశీర్వచనం అందజేశారు.

తప్పులు లేకుండా రీసర్వే చేయండి

నందిగామ టౌన్: ప్రభుత్వం జారీ చేసిన టైమ్‌లైన్ ప్రకారం తప్పులకు ఆస్కారం లేకుండా భూ రీసర్వేను పూర్తి చేయాలని ఆర్డీవో బాలకృష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌లో.. డివిజన్ పరిధిలో సర్వేలో పాల్గొనే సిబ్బందికి మంగళవారం రీ సర్వే వర్క్‌షాప్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వీరులపాడు మండలం వెల్లంకి, నందిగామ మండలం లచ్చపాలెం, జగ్గయ్యపేట మండలం గండ్రాయి, పెనుగంచిప్రోలు మండలం ముచ్చింతాల, వత్సవాయి మండలం లింగాల గ్రామాల్లో భూముల రీ సర్వే జరుగుతుందన్నారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో ర్యాలీలు, గ్రామ సభలు జరిగాయన్నారు. ప్రధానంగా విలేజ్ బౌండరీ, బ్లాక్ బౌండరీలతో పాటు ప్రభుత్వ భూములను ఫిక్స్ చేయాలని సూచించారు. రైతులకు అవగాహన కలిగించి రీసర్వేలో పాల్గొనేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ త్రివిక్రమరావు, డీఐఓఎస్ వెంకట స్వామి, డివిజన్‌లో తహసీల్దార్‌లు, రీసర్వే డీటీలు, మండల సర్వేయర్‌లు, వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్డీవో బాలకృష్ణ

డీసీసీబీ చైర్మన్ 'నెట్టెం'కు అభినందన

జగ్గయ్యపేట అర్బన్: కృష్ణా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్‌గా నియమితులైన మాజీ మంత్రి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాంకు పలువురు ఆ పార్టీ నేతలు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య).. రఘురాం నివాసానికి వెళ్లి వారికి ప్రతిమ అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నూకల కుమార్‌రాజా ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

నందిగామ రూరల్: కర్మాగారం బస్సు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ముగ్గురు యువకులకు గాయాలైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. సేకరించిన వివరాల మేరకు మండలంలోని అడవిరావులపాడు గ్రామ సమీపంలో మంగళవారం పెద్దవరం గ్రామంలోని క్రిక్స్ బయోటెక్స్ కర్మాగారానికి చెందిన బస్సు, ద్విచక్ర వాహనం ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. ఘటనలో అడవిరావులపాడుకు చెందిన అనిల్‌కుమార్, లవకుమార్, లోకేష్‌లకు గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వారిని నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నందిగామ డివిజన్
79950 92114 (నందిగామ)
99122 20547 (జగ్గయ్యపేట)
Office mail : sakshiads@gmail.com